సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం। 3। జూన్। 2023



అమరుల త్యాగం మరువబోం
అమరుల త్యాగాలు ఎన్నటికీ మరువబోమని విద్యుత్ శాఖ మంత్రి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. - 10లో



కేసీఆర్ చేతిలో తెలంగాణ బందీ
కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ అయిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. - 10లో

గరిష్టం/కనిష్టం
43°/28°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

అనతికాలంలోనే
అద్భుత విజయాలు




కలెక్టరేట్‌లో జాతీయ పతాకం ఎగురవేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, చిత్రంలో కలెక్టర్ పమేలా సత్పతి, డీసీపీ రాజేశ్‌చంద్ర, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న సునీత



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, కంచర్ల రామకృష్ణారెడ్డి, అమరేందర్

- విద్య, వైద్యం, తాగు, సాగునీటి రంగాల్లో విశేష అభివృద్ధి
- ఫ్లోరైడ్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాం
- 27 జాతీయ పంచాయతీ అవార్డులు రావడం మన పనితీరుకు నిదర్శనం
- తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత
- కలెక్టరేట్‌లో జాతీయ పతాకావిష్కరణ

సాక్షి, యాదాద్రి : 'మనం కలలుగంటున్న బంగారు తెలంగాణ దిశగా గడిచిన తొమ్మిదేళ్లలో బలమైన అడుగులు వేయగలిగాం.. సమస్యల వలయం నుంచి బయటపడడమే కాకుండా ప్రగతిశీల రాష్ట్రంగా యావత్ ప్రపంచ దృష్టిని తెలంగాణ ఆకర్షిస్తోంది.. జిల్లా కూడా అనతికాలంలోనే అద్భుతమైన విజయాలు సాధించింది' అని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి తదితర ప్రముఖులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ప్రభుత్వ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. విద్య, వైద్యం, తాగు, సాగునీటితో అన్ని రంగాల్లోనూ జిల్లా అపారమైన అభివృద్ధి సాధించిందని చెప్పారు. 2022 యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో 3.10 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు తెలిపారు. రైతుబీమా పథకం కింద 2,961 రైతు కుటుంబాలకు రూ.141.45 కోట్ల ఆర్థిక సహాయం అందజేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 4,390 మంది రైతులు 12,997 ఎకరాల్లో ఉద్యాన, మల్బరీ పంటలు సాగు చేస్తున్నారని, వీరికి రూ.40.92 కోట్ల సబ్సిడీని అందజేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 1,428 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసినట్లు వివరించారు.ధరణిలో 74,258 దరఖాస్తులు రాగా 70,778 దరఖాస్తులు పరిష్కరించామన్నారు. పల్లె ప్రగతిలో భాగంగా గ్రామ పంచాయతీల్లో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. జాతీయ పంచాయతీ అవార్డుల్లో జిల్లాకు 27 అవార్డులు రావడం మన పనితీరుకు నిదర్శనమన్నారు.

25,428 మందికి కేసీఆర్ కిట్లు

జిల్లాలో 25,428 మంది బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేసినట్లు విప్ సునీత తెలిపారు. యాదగిరిగుట్ట, చౌటుప్పల్‌లో 100 పడకల ఆస్పత్రుల నిర్మాణానికి మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో రూ.56 లక్షలతో హోమియోపతి ఆస్పత్రి భవనం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఇంటింటికీ భగీరథ నీరు

మిషన్ భగీరథ పథకం ద్వారా రూ.883. 92 కోట్ల వ్యయంతో ఇంటింటికీ నల్లాల ద్వారా మంచినీరు అందజేస్తూ ఫ్లోరైడ్ రహిత జిల్లాగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు.



అమరవీరుల కుటుంబాలను సన్మానిస్తున్న విప్ సునీత, ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్, డీసీపీ, అదనపు కలెక్టర్, కలెక్టర్, కంచర్ల రామకృష్ణారెడ్డి

పురోగతిలో బస్వాపురం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో నిర్మిస్తున్న బస్వాపూర్ రిజర్వాయర్ తుది దశ పూర్తి కావొచ్చిందని, ప్రధాన కాలువ పురోగతిలో ఉన్నాయన్నారు. మిషన్ కాకతీయ నాలుగో దశ ద్వారా జిల్లాలో 999 చెరువులకు గాను 914 చెరువుల పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. భువనగిరి మండలం సూరేపల్లి, వలిగొండ మండలం ఏదుల్లగూడెంలో లిఫ్ట్ ద్వారా 1,534 ఎకరాల ఆయకట్టు సాగులోకి తీసుకువచ్చామని వెల్లడించారు.

జిల్లాకు 3,464 ఇళ్లు మంజూరు కాగా 1,158 పూర్తి చేసి లబ్ధిదారులను ఎంపిక చేశామని చెప్పారు. గొల్లకురుములకు రూ.233 కోట్ల వ్యయంతో 3,91,755 గొర్రెలను సబ్సిడీపై పంపిణీ చేశామన్నారు. 2022–23లో 790 చెరువుల్లో 3 కోట్ల చేప పిల్లలను విడుదల చేశామని వెల్లడించారు. నేతన్నకు చేయూత పథకం ద్వారా 11,888 మంది కార్మికులకు రూ.32.38 కోట్ల ఆర్థిక సహాయం మంజూరైందన్నారు. చేనేతమిత్ర ద్వారా 20,860 మంది చేనేత కార్మికులకు 40 శాతం నూలు సబ్సిడీలో రూ.15.74 కోట్లు విడుదల చేశామని చెప్పారు. హరితహారంలో భాగంగా 8 విడతల్లో 4.85 కోట్ల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రూ.1300 కోట్లతో పునర్నిర్మాణం చేసినట్లు వెల్లడించారు. టీఎస్ఐపాస్ ద్వారా జిల్లాలో రూ.7,131,83 పెట్టుబడితో 910 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని వివరించారు. ఆయా పరిశ్రమల ద్వారా 36, 784 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు.గీత కార్మికుల ఆర్థికాభివృద్ధికోసం భువనగిరి మండలం నందనంలో నీరా ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయన్నారు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు అధునాతన అగ్నిమాపక వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. జిల్లాలోని 6 అగ్నిమాపక కేంద్రాల పరిధిలో 1,858 ఘటనలు చోటు చేసుకోగా రూ.235 కోట్ల ఆస్తి, 21 మంది ప్రాణాలను కాపాడమన్నారు. భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్టలో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. సీఎం కప్ క్రీడా పోటీల్లో ఖోఖో మహిళా విభాగంలో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మొదటి బహుమతి రావడం గర్వకారణమన్నారు. వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, భువనగిరి మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

338 కుటుంబాలకు దళితబంధు

సీఎం కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రిలో దళితబంధు పథకం కింద 75 దళిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున రూ. 7.50 కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. అంతేకాకుండా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి వంద కుటుంబాల చొప్పున జిల్లాలో 338 కుటుంబాలకు దళితబంధు యూనిట్లు మంజూరు చేసి ఆర్థిక పురోగతికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందన్నారు.

నేడు రైతు దినోత్సవం

సాక్షి, యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం చేపట్టిన ప్రగతి కార్యక్రమాలను నాడు – నేడు పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత వానాకాలం, యాసంగి పంటల సాగు వివరాలు, రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాల వివరాలను ఫ్లెక్సీల రూపంలో ప్రదర్శించనున్నారు. 92 క్లస్టర్లలో ఒక్కో రైతు వేదిక వద్ద వెయ్యి మంది మంది రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తారు. రైతు బంధు సమితి అధ్యక్షులు సభ్యులు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, రైతులు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు పాల్గొననున్నారు.



విద్యుత్ లైట్ల అలంకరణలో భువనగిరి క్లస్టర్ రైతు వేదిక

న్యూస్‌రీల్

నేడు ప్రభుత్వ సీఎస్ రాక

భూదాన్‌పోచంపల్లి : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం భూదాన్‌పోచంపల్లిలో నిర్వహించనున్న తెలంగాణ రైతు దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ రఘునందన్ రావు, కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు హాజరుకానున్నారు. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి ఏజాజ్ అలీఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీసీ హాస్టళ్లలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి టౌన్ : 2023 – 24 విద్యా సంవత్సరానికి గాను బీసీ వసతి గృహాల్లో ప్రవేశం పొందడానికి ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు www. bchostel.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉపకార వేతనాలకోసం..

ఉపకార వేతనాలు, బోధన ఫీజు కోసం దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 15వ తేదీ వరకు మరో అవకాశం కల్పించినట్లు ఎస్సీ సంక్షేమ అధికారి జైపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎయిమ్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బీబీనగర్ : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం ఎయిమ్స్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీవాసులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రతి 15 రోజులకోసారి హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీధర్, శివరాం, రమ్య, కాలనీ నాయకులు పొట్ట నవీన్‌కుమార్, వెంకటేష్, ఉపేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



రైతువేదిక వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

భువనగిరిటౌన్ : మండలంలోని బొల్లెపల్లిలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని నిరసిస్తూ రైతులు స్థానిక రైతువేదిక వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. లారీలు రావడం లేదన్న సాకుతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని, వర్షాకాలం ముంచుకొస్తున్నందున త్వరగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రేపటి నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తామని సింగిల్‌విండో చైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు గడ్డమీద వీరస్వామి గౌడ్, రావి మధుసూదన్ రెడ్డి హిమంత్ రెడ్డి గుండు కష్ణ బాబురావు కొత్తపల్లి శేఖర్ పాల్గొన్నారు.

మదర్ డెయిరీ సిబ్బంది వేతనాలు పెంపు

నల్లగొండ అగ్రికల్చర్ : మదర్ డెయిరీలో పనిచేస్తున్న ఆఫీస్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, హెల్పర్లకు వేతనాలను పెంచుతున్నట్లు మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఉన్న వేతనంపై ఆఫీస్ అసిస్టెంట్‌లకు రూ.1,507, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.2,777,హెల్పర్లకు రూ.3,012 పెంచుతున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో పోటీ నెలకొన్న నేపథ్యంలో పాల విక్రయాలపై సిబ్బంది దృష్టి సారించాలని కోరారు.

బీజేపీని గద్దె దింపడమే లక్ష్యం

చింతపల్లి : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని గద్దె దింపడమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలోని మోద్గులమల్లేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలన్నారు. ఈనెల 4న ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో జరిగే సీపీఐ బహిరంగ సభకు ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అంతటా 41 డిగ్రీల పైనే..

- ఉగ్రరూపం ప్రదర్శిస్తున్న భానుడు
- ఇబ్బంది పడుతున్న రైతులు, కూలీలు



భువనగిరిటౌన్ : వానాకాలం సమీపిస్తున్నా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం లేదు. ఉదయం 7 గంటలకు మొదలుకొని సాయంత్రం 5 దాటినా ఎండ తీవ్రత తగ్గడం లేదు. ఎండకు ఉక్కపోత, వడగాలి తోడవంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం జిల్లాలోని వివిధ మండలాల్లో 40 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వలిగొండలో 42.5, బీబీనగర్ 42.4, రామన్నపేట 42.3, చౌటుప్పల్ 42.1, బొమ్మలరామారం 42.0, సంస్థాన్ నారాయణపురం 41.5, మోత్కూర్ 41.5, భువనగిరిలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాగు పనులు మొదలుకావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియాదే



భువనగిరిలో సోనియాగాంధీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత సోనియాగాంధీకే దక్కుతుందని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మాటకు కట్టుబడి రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు తల్లివంటిదన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భువనగిరిలోని బాబు జగ్జీవన్‌రాం చౌరస్తా వద్ద సోనియాగాంధీ ఫ్లెక్సీకి పార్టీ నాయకులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత సోనియాగాంధీకి దక్కుతుందని, రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ సోనియాగాంధీని మరువబోరని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల వాగ్దానాలలో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. వేలాది మంది అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రంలో ఉద్యోగాలు వస్తాయని ఆశపడ్డ నిరుద్యోగులకు నిరాశే మిగిలిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తుందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అంతకుముందు తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భువనగిరి పట్టణ శాఖ అధ్యక్షుడు బీసుకుంట్ల సత్యనారాయణ నాయకులు సోమయ్య, చిక్కుల వెంకటేశం, సలావుద్దీన్, గుర్రాల శ్రీనివాస్, మజహార్, చల్లగురుల రఘుబాబు, పాశం శివనంద్, పిట్టల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల గుట్టు రట్టు!

నాగపూర్ కేంద్రంగా రూ.కోట్ల వ్యాపారం

- పోలీసుల కళ్లు గప్పి రైతులకు సరఫరా
- చౌటుప్పల్‌లోని నవత ఆగ్రో డివిజన్ గోదాముపై ఎస్‌ఓటీ పోలీసుల దాడులు
- 2.2 టన్నుల నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం
- ల్యాబ్ టెస్ట్‌లో నకిలీవిగా నిర్ధారణ
- ఇద్దరి అరెస్ట్, పరారీలో మరొకరు



చౌటుప్పల్‌లో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాల బ్యాగులను పరిశీలిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

చౌటుప్పల్ : వానాకాలం సమీపిస్తుండడంతో నకిలీ విత్తనాల వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తోంది. టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నా వ్యాపారులు తమకున్న మార్గాల ద్వారా అక్రమ వ్యాపారానికి తెరలేపుతున్నారు. చౌటుప్పల్‌కు చెందిన ఓ వ్యాపారి గత కొన్నేళ్లుగా పోలీసుల కళ్లుగప్పి రైతులకు నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు దుకాణంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. రూ.60లక్షల విలువ చేసే విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.

నాగపూర్ నుంచి సరఫరా

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన రావి చంద్రశేఖర్ కొన్నేళ్ల క్రితం చౌటుప్పల్‌కు వచ్చాడు. నవత ఆగ్రో డివిజన్ పేరిట దుకాణం ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నాడు. ఆయన కుమారుడు ప్రసన్నకుమార్ సైతం ఇదే వ్యాపారంలో ఉన్నాడు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా గారపాడు గ్రామానికి చెందిన గడ్డం రవీంద్రబాబు, చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన నర్సింహులుతో కలిసి ప్రసన్నకుమార్ నకిలీ విత్తనాల దందా సాగిస్తున్నాడు. నిషేధిత బీటీ–3 హెచ్‌టీ విత్తనాలను మహారాష్ట్రతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో నాగపూర్ నుంచి పెద్ద ఎత్తున తీసుకువచ్చిన పత్తి విత్తనాలను చౌటుప్పల్‌లోని గోదాంలో నిల్వ చేశారు. రైతులకు సరఫరా చేసే క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు గురువారం దాడులు నిర్వహించి పట్టుకున్నారు. 2.2 టన్నుల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు సభ్యులు గల ముఠాలో రవీంద్రబాబు, ప్రసన్నకుమార్‌ను అదుపులోకి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు నర్సింహులు పరారయ్యాడు. రవాణాకు వినియోగిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన విత్తనాల విలువ రూ.60లక్షల వరకు ఉంటుందని అంచనా. ఎస్‌ఓటీ పోలీసులు ఈ కేసును స్థానిక పోలీసులకు అప్పగించారు. కాగా పట్టుబడిన విత్తనాలను గురువారం హైదరాబాద్‌లో సీపీ డీఎస్ చౌహాన్ సమక్షంలో వ్యవసాయాధికారులు టెస్ట్ చేయగా నకిలీవిగా నిర్ధారణ అయ్యింది.

లాభార్జనే ధ్యేయంగా..

విత్తన దుకాణాల నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా వ్యాపారం సాగిస్తున్నారు. రైతుల ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సీజన్ ప్రారంభం అవ్వగానే తనిఖీ బృందాల కళ్లుగప్పి రకరకాల విత్తనాలు తీసుకువచ్చి రైతులకు అంటగడుతున్నారు. చేను ఎదుగుదల, పంటల దిగుబడి వంటి అంశాలను పూర్తిగా విస్మరిస్తున్నారు.

హడావుడిగా తనిఖీలు!

నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేశారు. ఆయా బృందాలు ఎరువులు, విత్తన దుఖానాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అయినా వ్యాపారులు అధికారుల కళ్లుగప్పి తమ దందా కొనసాగిస్తున్నారు. అధికారులు పక్కాగా తనిఖీలు చేయడం లేదని, దుకాణదారులతో ఉన్న సంబంధాలతో మొక్కుబడిగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

లైసెన్సు రద్దుకు ప్రతిపాదించాం



నిషేధిత పత్తి విత్తనాల ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. పట్టుబడిన వ్యక్తికి సంబంధించిన దుకాణ లైసెన్సు రద్దుకు ప్రతిపాదించాం. ఈ ప్రాంతంలోని అన్ని దుకాణాల్లో విస్తత తనిఖీలు నిర్వహిస్తాం. రైతులను మోసం చేస్తే క్రిమినల్ కేసులు నమోదవుతాయి.

–ముత్యాల నాగరాజు, మండల వ్యవసాయాధికారి

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారి ఊంజలి సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ మాఢ, తిరువీధిలో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో ఊంజలి సేవ జరిపించారు. మహిళలు మంగళ హారతులతో సేవకు స్వాగతం పలికారు. ఇక యాదాద్రీశుడికి నిత్యకైంకర్యాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం అర్చనలు, అభిషేకం, సుదర్శనహోమం, నిత్యకల్యాణం తదితర పూజలు గావించారు. వివిధ పూజల ద్వారా శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.34,12,537 సమకూరినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు.



ఆండాళ్ అమ్మవారి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

క్లుప్తంగా

పెట్రోల్ బంక్‌లో యువకుల వీరంగం

● బంక్ సిబ్బంది, పోలీసులపై దాడి

నూతనకల్: మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో గురువారం సాయంత్రం ఇద్దరు యువకులు వీరంగం సృష్టించారు. బంక్ సిబ్బందితో పాటు పోలీసులపై దాడి చేశారు. బంక్ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇండియన్ ఆయిల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకునేందుకు వచ్చిన ఇద్దరు యువకులు బంక్ సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తించి విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. దీంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులపై కూడా యువకులు దాడి చేయగా వారిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ హరిప్రసాద్‌ను వివరణ కోరగా.. సూర్యాపేట మండలం యర్కారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తప్పతాగి బంక్ సిబ్బందితో పాటు పోలీసులపై దాడి చేయగా వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

కారు, రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

భువనగిరిటౌన్: కారు, రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి స్వల్ప గాయాలైన సంఘటన భువనగిరి మండల పరిధిలోని కునూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరికి చెందిన భరత్, అతడి తల్లి ఉప్పలమ్మ కునూరులో తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాయిగిరి వైపు వస్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు వీరి బైక్‌తో పాటు మరో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భరత్, ఉప్పలమ్మతో పాటు మరో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

● వైభవంగా 'దశాబ్ది' పండుగ



సూర్యాపేటలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేటలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



నల్లగొండలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



సీఎం కప్ విజేతలైన క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న గుత్తా



భువనగిరిలో అమరుల కుటుంబాలను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ సునీత



నల్లగొండ కలెక్టరేట్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



సూర్యాపేటలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు



సూర్యాపేటలోని విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బద్దం రాజు(26)కు భార్య తులసి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా పని సరిగా నడవకపోవడంతో అప్పులు చేశాడు. అంతేకాక మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య, తండ్రితో గొడవపడ్డాడు. అనంతరం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రాత్రి గ్రామంలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామానికి చెందిన దేవిగారి బాలయ్య అనే రైతు గ్రామశివారులో ఉన్న వ్యవసాయబావి వద్దకు పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్తుండగా అక్కడ చెట్టుకు చొక్కాతో ఉరివేసుకున్న రాజును గమనించాడు. వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



రోదిస్తున్న బంధువులు

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

● పానగల్లులోని ఉదయ సముద్రంలో ప్రమాదం
● మృతుడి స్వస్థలం తిప్పర్తి... మండలంలోని పెద్దదేవులపల్లి

నల్లగొండ క్రైం: పానగల్లులోని ఉదయ సముద్రంలో గురువారం చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. నల్లగొండ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన అంబటి నాగరాజు(30) తన భార్య ప్రశాంతి, ఇద్దరు కుమార్తెలతో కలిసి నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లులో అద్దె ఇంట్లో నివాసముంటూ ఉదయ సముద్రంలో చేపలు పడుతూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం కూడా అతడు చేపలు పట్టేందుకు తెప్పపై ఉదయ సముద్రంలోకి వెళ్లగా ఈదురుగాలులకు తెప్ప తిరగబడడంతో నీటిలో పడిపోయాడు. ఒడ్డుకు 10ఫీట్ల దూరం వరకు ఈదుకుంటూ వచ్చిన నాగరాజు అప్పటికే అలసిపోయి చెరువులోనే గల్లంతయ్యాడు. తోటి జాలర్లు గమనించి నాగరాజు మృతదేహం కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని గురువారం రాత్రంతా నాగరాజు మృతదేహం వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం ఒడ్డున నాగరాజు మృతదేహం లభ్యమవ్వడంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.



నాగరాజు (ఫైల్)

పెద్దదేవులపల్లిలో విషాదఛాయలు..

త్రిపురారం: అంబటి నాగరాజు మృతితో త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నాగరాజు నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లులో నివాసముంటూ పెద్దదేవులపల్లి గ్రామంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో సివిల్ వర్కర్‌గా పనిచేస్తుండేవాడని గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో పాటు నాగరాజు మత్స్యకారుడు కావడంతో అదనపు ఆదాయం కోసం సమయం ఉన్నప్పుడల్లా పానగల్లులోని ఉదయ సముద్రంలో చేపలు పట్టి అమ్మేవాడని తెలిపారు. కాగా శుక్రవారం పెద్దదేవులపల్లిలో నాగరాజు కుటుంబ సభ్యులు అతడి అంత్యక్రియలు నిర్వహించారు. నిరుపేద అయిన నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని పెద్దదేవులపల్లి మత్స్యకార సంఘం సభ్యులు కోరుతున్నారు.

వడదెబ్బతో ఒకరు మృతి

పెద్దవూర: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పెద్దవూర మండలం నీమా నాయక్‌తండాకు చెందిన రమావత్ బాలు(33) గురువారం తన వ్యవసాయ పొలంలో పనులు చేయటానికి వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. విపరీతమైన ఎండలకు వడదెబ్బకు గురై ఇంటికి రాగానే కడుపులో నొప్పి వస్తుందని వాంతులు చేసుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులు స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

యువకుడు అదృశ్యం

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని హనుమాన్‌నగర్‌కాలనీలో మానసిక స్థితి సరిగా లేని ఓ యువకుడు గురువారం తప్పిపోయాడు. ఈమేరకు ఎస్సై సైదులు శుక్రవారం వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని చింతల్‌లోని వాజ్‌పేయినగర్‌కు చెందిన కుంభా యేసమ్మ తన కుమారుడు కుంభా సాయి(19)తో కలిసి స్థానిక హనుమాన్‌నగర్‌లో ఉంటుంది. యేసమ్మ కేశాల వ్యాపారం చేస్తుంటుంది. కుమారుడు మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సాయి తిరిగి ఇంటికి చేరుకోలేదు. స్థానికంగా, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యేసమ్మ శుక్రవారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



సాయి (ఫైల్)

మంటలు చెలరేగి రెండు బైక్‌లు, ఆటో దగ్ధం

డిండి: వివాహం జరిగిన ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు టెంటుకు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగి రెండు బైక్‌లు, ఆటో దగ్ధమయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం డిండి మండలంలోని గోనబోయనపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోనబోయనపల్లి గ్రామానికి చెందిన మండి వెంకటయ్య కుమారుడు సైదులు వివాహం గురువారం జరిగింది. వివాహాన్ని పురస్కరించుకొని ఇంటి ముందు ఏర్పాటు చేసిన టెంట్‌కు గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. ఇది గమనించిన వెంకటయ్య కుటుంబ సభ్యులు, బంధువులు మంటలు ఆర్పేసరికి టెంటు కింద ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం గాజర గ్రామానికి చెందిన గణేష్ బైక్‌తో పాటు మరో బంధువు బైక్ పూర్తిగా దగ్ధమయ్యాయి. అదేవిధంగా మండి వెంకటయ్యకు చెందిన ఆటోలోని సీట్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు.

గ్రామపంచాయతీ ట్రాక్టర్ బోల్తా

త్రిపురారం: మండలంలోని బొర్రాయిపాలెం గ్రామపంచాయతీ ట్రాక్టర్ హర్యతండా సమీపంలో శుక్రవారం బోల్తా పడింది. ట్రాక్టర్ నడపడం రాని వ్యక్తి ట్రాక్టర్ నడపడంతోనే బోల్తా పడినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే ట్రాక్టర్‌లో సెంట్రింగ్‌కు సంబంధించిన సామగ్రి ఉండడంతో గ్రామపంచాయతీ పనులకు కాకుండా ఇతర పనులకు ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బొర్రాయిపాలెం సర్పంచ్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బోల్తా పడిన ట్రాక్టర్

చార్‌ధామ్ యాత్రలో కొండమల్లేపల్లి వాసి మృతి

కొండమల్లేపల్లి: చార్‌ధామ్ యాత్రలో భాగంగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కేదార్‌నాథ్ దర్శనానికి వెళ్లి కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ మారం మురళి(75) మే 27న మండల కేంద్రానికే చెందిన కండె చంద్రయ్య కుటుంబ సభ్యులతో కలిసి చార్‌ధామ్ యాత్రకు బయల్దేరారు. యాత్ర ప్రారంభమైన నాటి నుంచి తన యోగక్షేమాలు ఫోన్ ద్వారా కుమారుడు వెంకటేశ్వర్లుకు తెలియజేసేవాడు. గురువారం మురళి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుమారుడు వెంకటేశ్వర్లు తన తండ్రి గురించి తెలుసుకునేందుకు కండె చంద్రయ్యకు ఫోన్ చేశాడు. తామంతా గదిలోనే ఉన్నామని, మురళి ఒక్కడే గుర్రంపై కేదార్‌నాథ్ దర్శనానికి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదని ఆయన తెలిపాడు. కాగా శుక్రవారం మధ్యాహ్నం తన తండ్రి మరణించినట్లు తెలిసిందని వెంకటేశ్వర్లు పేర్కొన్నాడు. మృతదేహాన్ని ఇక్కడకు తీసుకురావడం కోసం ఉత్తరాఖండ్ వెళ్తున్నట్లు ఆయన తెలిపారు.



మురళి (ఫైల్)

పాఠశాలలో చోరీకి యత్నం

● తలుపులు, బీరువాలు ధ్వంసం

మాడుగులపల్లి: మండలంలోని కుక్కడం ప్రాథమికోన్నత పాఠశాలలో దుండగులు చోరీకి యత్నించారు. ఆఫీస్ గది తలుపులు పగులగొట్టి బీరువాలను తెరిచేందుకు ప్రయత్నించారు. హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆఫీస్ గదిలో కంప్యూటర్లు, మధ్యాహ్న భోజనానికి కావాల్సిన బియ్యం, ఇతర వస్తువులతో పాటు మూడు బీరువాలు ఉన్నాయి. వీటిలో సైన్స్ మెటీరియల్, రికార్డులు, ఆట సామగ్రి భద్రపరిచారు. ఇటీవల దుండగులు గది తలుపులు ధ్వంసం చేసి ఓ బీరువా తలుపును ఇనుప చువ్వ సాయంతో తెరిచారు. ఇందులో సైన్స్ మెటీరియల్ ఉండడంతో అలాగే వదిలేశారు. మిగిలిన రెండింటి తలుపులు తెరుచుకోకపోవడంతో చేసేది లేక వెళ్లిపోయారు. శుక్రవారం దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు సిబ్బంది పాఠశాలకు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మే 12న పాఠశాలను సందర్శించినప్పుడు అంతా సవ్యంగానే ఉందని, ఆ తర్వాత ఈ ఘటన జరిగిందని హెచ్‌ఎం భావిస్తున్నారు. బీరువాలోని ఆట వస్తువుల కోసమే దుండగులు చోరీకి యత్నించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

పెద్దవూర: బైక్‌ను కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం పెద్దవూర మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన మాసిన సత్యనారాయణరెడ్డి(33) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తన బైక్‌పై పెద్దఅడిశర్లపల్లికి వెళ్లి పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా పెద్దవూర మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే మల్లేపల్లి వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై సత్యనారాయణరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.



సత్యనారాయణ రెడ్డి (ఫైల్)

బైక్ అదుపుతప్పి.. డివైడర్‌ను ఢీకొట్టి..

కట్టంగూర్: మండలంలోని పామనగుండ్ల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన ఎస్. సయ్యద్(26) తన తల్లితో కలిసి బైక్‌పై స్వగ్రామం నుంచి కట్టంగూర్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో పామనగుండ్ల గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో సయ్యద్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు..

ఆలేరురూరల్: ఆలేరు బైపాస్ రోడ్డులో వోల్వో బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆలేరు ఎస్సై వెంకటశ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు బైపాస్ రోడ్డులోని మాడీస్ రెస్టారెంట్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ వోల్వో బస్సు ఢీకొంది. దీంతో అతడి తల, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వీఆర్‌ఏ భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచినట్లు పేర్కొన్నారు.




పెళ్లి ఊరేగింపులో బ్లేడ్‌తో దాడి

● బాలుడితో పాటు మరొకరిపై కేసు నమోదు

కోదాడరూరల్: పెళ్లి ఊరేగింపులో బ్లేడ్‌తో దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కోదాడ పట్టణ సీఐ పి. ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురంలో గురువారం రాత్రి ఓ పెళ్లి ఊరేగింపు నిర్వహిస్తుండగా గాంధీనగర్‌కు చెందిన కుదుముల వరుణ్‌తేజ్, మైనర్ అయిన అతడి తమ్ముడికి మరో మైనర్ బాలుడికి మధ్య ఘర్షణ జరిగింది. ఇది మనస్సులో పెట్టుకున్న వరుణ్‌తేజ్, అతడి తమ్ముడు కలిసి మైనర్ బాలుడి బ్లేడ్‌తో దాడి చేయడంతో అతడి గొంతు, ముఖంపై గాయాలయ్యాయి. అక్కడే ఉన్న సదరు బాలుడి తండ్రిపై కూడా దాడి చేయగా అతడికి కూడా స్వల్పగాయాలయ్యాయి. బాలుడి తండ్రి దాసరి మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి వరుణ్‌తేజ్‌ను రిమాండ్‌కు, అతడి తమ్ముడు మైనర్ కావడంతో హైదరాబాద్‌లోని జువైనల్ హోంకు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

మునగాల(కోదాడ): మండలంలోని మాధవరం గ్రామ శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన శ్రీనివాస్, లక్ష్మి దంపతులు కోదాడలో శుభకార్యానికి వెళ్లేందుకు బైక్‌పై బయల్దేరారు. మార్గమధ్యలో మునగాల మండలంలోని మాధవరం గ్రామ శివారులో సూర్యాపేట నుంచి కోదాడ వైపు వెళ్లే కారు అతివేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టి ముందు వెళ్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో దంపతులిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఇద్దరిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సంఘటనపై ఇప్పటివరకు తమకు లిఖితపూర్వక ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి కూడా స్వల్ప గాయాలైనట్లు ఎస్‌ఐ వివరించారు.



గాయపడిన శ్రీనివాస్

కారులో నగదు చోరీ

● రూ.1.20 లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు

బీబీనగర్: సర్పంచ్ భర్త కారు అద్దాలు గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి రూ.1.20లక్షల నగదు, పట్టాదారు పాసుపుస్తకం చోరీ చేసిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ యుగేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలంలోని జమీలాపేట గ్రామ సర్పంచ్ కొమ్మిడి ప్రేమలత భర్త సుభాష్‌రెడ్డి గురువారం బీబీనగర్‌లోని యూనియన్ బ్యాంక్‌కు వచ్చి రూ.1.20 లక్షల నగదు విత్‌డ్రా చేశాడు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చి కారును కార్యాలయం బయట పార్కింగ్ చేశాడు. బ్యాంకు నుంచి సుభాష్‌రెడ్డిని ఫాలో అవుతున్న దుండగులు కారు వద్దకు వచ్చి అద్దాలను పగులగొట్టి రూ.1.20లక్షల నగదు, భూమి పట్టాదారు పాసుపుస్తకం అపహరించుకుపోయారు. తన కారులో చోరీ జరిగినట్లు గుర్తించిన సుభాష్‌రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు బ్యాంక్ వద్ద గల సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి అనుమానితులు ఇద్దరు బ్యాంక్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గులాబీ జెండాకే ఓట్లడిగే హక్కుంది



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆత్మకూరు(ఎం): తెలంగాణ ప్రజలను ఓట్లడిగే హక్కు ఒక్క గులాబీ జెండాకే ఉందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని పీఎస్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పల్లెలు ఏ విధంగా ఉన్నాయో, రాష్ట్రం ఏర్పాటయ్యాక బీఆర్ఎస్ హయాంలో పల్లెలు ఎట్ల ఉన్నాయో ఓసారి బేరీజు వేసుకోవాలన్నారు. మే 28న సీఎం కేసీఆర్‌ను ప్రగతి భవన్‌లో కలిసి బునాదిగానికాల్వ ద్వారా గోదావరి జలాలను అందించాలని కోరుతూ సమస్యను వివరించడంతో సానుకూలంగా స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు చెప్పారు. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి, బండి సంజయ్, కిషన్‌రెడ్డిలకు తెలంగాణ ఆవిర్భావ వేడుకలను నిర్వహించుకునే అర్హత కూడా లేదన్నారు. అంతకుముందు ఆత్మకూరు(ఎం) పాత గ్రామం నుంచి పీఎస్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆత్మీయ సమ్మేళనం జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఆయిల్‌ఫెడ్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, గ్రంథాలయ సమితి జిల్లా డైరెక్టర్ మేడి రామనర్సయ్య, యాదగిరిగుట్ట జెడ్పీటీసీ తోటకూర అనురాధ, రైతు సమితి మండల అధ్యక్షుడు యాస ఇంద్రారెడ్డి, జిల్లా సభ్యులు కోరె భిక్షపతి, బీసు ధనలక్ష్మి, ఎంపీటీసీ యాస కవిత, జిల్లా నాయకులు పాల్గొన్నారు.